సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని డీఆర్‌డీవో సాయన్న సూచించారు.

- 8లో ▸



బదిలీల తర్వాతే..

బదిలీల ప్రక్రియ పూర్తయ్యాకే కొత్త నియామకాలు చేపట్టాలని గురుకులాల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.5 /18.2

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా రాంసింగ్



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా రాంసింగ్ నియమితులయ్యారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పెరుగు వెంకటేశ్వర్లు ఆయనకు సోమవారం నియామక పత్రాన్ని అందించారు. రాంసింగ్ కామారెడ్డి వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగిని ఎలుకలు కరిచిన ఘటనలో సూపరింటెండెంట్ విజయలక్ష్మిని ప్రభుత్వానికి సరెండర్ చేసిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో రాంసింగ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

డీఆర్‌డీవో, జెడ్పీ సీఈవోల బదిలీ

సాక్షి, కామారెడ్డి: ఎన్నికల నేపథ్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి (డీఆర్‌డీవో) జి.సాయన్న, జిల్లా పరిషత్ సీఈవో డి.సాయాగౌడ్ బదిలీ అయ్యారు. సాయన్నను ఆదిలాబాద్ డీఆర్‌డీవోగా, జెడ్పీ సీఈవో సాయాగౌడ్‌ను నిజామాబాద్ డీఆర్‌డీవోగా పంపించారు. నిజామాబాద్‌లో పనిచేస్తున్న బి.చందర్‌కు కామారెడ్డి డీఆర్‌డీవోగా, మల్కాజ్‌గిరిలో పనిచేస్తున్న పద్మజారాణికి కామారెడ్డి జిల్లా పరిషత్ సీఈవోగా పోస్టింగ్ ఇచ్చారు. సంగారెడ్డిలో అడిషనల్ డీఆర్డీవోగా పనిచేస్తున్న ఎస్.వామన్‌రావ్ కామారెడ్డి అడిషనల్ డీఆర్డీవోగా రానున్నారు.

బాన్సువాడ డీఎస్పీ..

కామారెడ్డి క్రైం: బాన్సువాడ డీఎస్పీ జగన్నాథరెడ్డి బదిలీ అయ్యారు. ఆయనను హైదరాబాద్ ఏసీబీ డీఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో హైదరాబాద్ ఇంటెలిజెన్స్‌లో ఉన్న సత్యనారాయణకు బాన్సువాడ డీఎస్పీగా పోస్టింగ్ ఇస్తూ పోలీసు శాఖ నుంచి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

21 నుంచి పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ రెగ్యులర్ సెమిస్టర్ పరీక్షలు 21 నుంచి ప్రారంభం అవుతాయని కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుంచి ప్రారంభం కావాల్సిన సెమిస్టర్ పరీక్షలను విద్యార్థుల కోరిక మేరకు వాయిదా వేశామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ప్రత్యామ్నాయ పాఠశాల ప్రారంభం



లింగంపేట: బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని డీఈవో రాజు పేర్కొన్నారు. సోమవారం ఆయన ముస్తాపూర్‌లో ప్రత్యామ్నాయ పాఠశాల(వర్క్ సైట్ స్కూల్)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు మహారాష్ట్ర నుంచి కూలీలు వస్తున్నారన్నారు. కూలీల పిల్లలు విలువైన విద్యను నష్టపోకుండా వర్క్‌సైట్ స్కూళ్లను ఏర్పాటు చేయడంతోపాటు వలంటీర్‌ను నియమించి నాలుగు నెలలపాటు విద్యనందిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంఈవో రామస్వామి, సీఆర్పీ విజయ్‌కుమార్, ఇటుకబట్టీల యజమాని సంజీవులు తదితరులున్నారు.

‘ఎస్‌డీఎఫ్’కు ఇన్‌చార్జి మంత్రి ఆమోదం తప్పనిసరి

మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి కేటాయించిన స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్)ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతోనే ఖర్చు చేయాలని నిర్దేశించారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలను స్వీకరించిన అనంతరం ప్రతి నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున ఎస్‌డీఎఫ్‌ను మంజూరు చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు లేని చోట పార్టీ ఇన్‌చార్జీల ద్వారా ప్రతిపాదనలను సేకరించి ఇన్‌చార్జి మంత్రి ఆమోదం పొందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, కామారెడ్డి, బాన్సువాడలలో బీఆర్‌ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఆయా నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలకు బాధ్యతలు ఇచ్చి వారి ద్వారా అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కోసం తీసుకునే చర్యల గురించి ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆమోదం తీసుకుని నిధులకు సంబంధించిన పనులను చేపట్టనున్నారు.

తప్పెవరిది..!?

కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులను ఎలుకలు కరిచిన ఘటనలో వైద్యులపై చర్యలు తీసుకోవడం వివాదాస్పదంగా మారింది. దీనిపై వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము వైద్యం అందించాలా, లేక ఎలుకలు పట్టాలా అని ప్రశ్నిస్తున్నారు.

- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఎలుకల సంచారం
- బాధ్యులను చేస్తూ వైద్యులపై సస్పెన్షన్ వేటు
- నిరసన వ్యక్తం చేసిన వైద్యులు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి చెంతకు వివాదం



ఆస్పత్రి ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్యులు

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈనెల 10వ తేదీన ఎలుకలు ఐసీయూలోకి చొరబడి షేక్ ముజీబ్ అనే రోగిని కరిచి గాయపరిచాయి. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ ఈ ఘటనపై విచారణ జరిపారు. విచారణలో సానిటేషన్ తప్పిదంతోపాటు ఐసీయూ విభాగం విధుల్లో ఉన్న వైద్యులు, నర్సు, ఆస్పత్రి సూపరింటెండెంట్ వివరాలను నమోదు చేసుకుని కలెక్టర్‌కు నివేదికను అందించారు. డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ సైతం విచారణ చేసి సానిటేషన్ తప్పిదంలా ఉందని నివేదించారు. విచారణ నివేదిక ఆధారంగా ఘటన జరిగిన రోజు విధుల్లో ఉన్న వైద్యులు వసంత్‌కుమార్, కావ్యలతోపాటు నర్సింగ్ ఆఫీసర్ మంజులను సస్పెండ్ చేస్తూ డీఎంఈ అధికారి త్రివేణి ఆదివారం ఉత్తర్వులను జారీ చేశారు. అలాగే ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మిని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రభుత్వానికి సరెండర్ చేశారు.

బాధ్యులపై చర్యలేవి?

ఎలుకల దాడి ఘటనలో వైద్యులను బలి చేయడం చర్చనీయాంశంగా మారింది. సానిటేషన్ కాంట్రాక్టర్‌ను వదిలేసి వైద్యులను సస్పెండ్ చేయడంతో వైద్యులు ఆగ్రహంతో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ టీచింగ్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేశారు. సంఘటనకు అసలు బాధ్యులెవరన్న విషయాన్ని తేల్చాలని, వైద్యులపై సస్పెన్షన్ వేటు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు. అలాగే నర్సింగ్ ఆఫీసర్‌ను బలి చేయడంతో నర్సింగ్ సిబ్బంది కూడా ఆందోళనలు చేస్తున్నారు.

మళ్లీ డీఎంఈ బృందం విచారణ

వైద్యుల సస్పెన్షన్ ఘటనపై డీఎంఈ ఆదేశాలతో సోమవారం ముగ్గురు సభ్యుల ప్రత్యేక డీఎంఈ బృందం ఆస్పత్రిలో విచారణ జరిపింది. ఎలుకల సంచారాన్ని సానిటేషన్ కాంట్రాక్టర్ తప్పిదంగా గుర్తించారు. పలుమార్లు ఇలాంటి ఘటనలు జరగడంతో కాంట్రాక్టర్‌కు షోకాజ్ నోటీస్‌ను అందించారు. నివేదికను ప్రభుత్వానికి అందించనున్నామన్నారు.

ఒక్కొక్కరిది ఒక్కో తీరు నివేదిక

ఆస్పత్రిలో రోగులపై ఎలుకల దాడి ఘటనపై ఒక్కో అధికారి ఒక్కో తీరున విచారణ నివేదిక అందించినట్లు తెలుస్తోంది. టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, డీఎంఈ బృందం.. ఇలా వీరందరు భిన్నంగా విచారణ నివేదికలు ఇచ్చారు. కాంట్రాక్టర్ తప్పిదమని, ఆస్పత్రి భవనం ఇరుకుగా ఉందని, ఐసీయూ విభాగం మరమ్మతు పనులు కారణమని, రోగులు భోజనం చేసి వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారని, విధుల్లో ఉన్న వైద్యులు పట్టించుకోలేదని, వైద్యాధికారుల పర్యవేక్షణ లోపమని.. ఇలా పలురకాలుగా నివేదికలు సమర్పించారు. కానీ చివరకు వైద్యులను బలిచేయడం, కాంట్రాక్టర్‌ను తప్పించడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మాకేం సంబంధం..

ఆస్పత్రిలోకి ఎలుకలు రావడానికి, తమ విధులకు ఏం సంబంధమని సస్పెన్షన్‌కు గురైన వైద్యులు వసంత్‌కుమార్, కావ్య, నర్సింగ్ ఆఫీసర్ మంజుల ప్రశ్నించారు. వారు సోమవారం ‘సాక్షి’తో మాట్లాడారు. సంఘటన జరిగిన రోజు తాను గాంధీ ఆస్పత్రిలో ఎగ్జామినర్‌గా ఉన్నానని, ఈ ఘటనలో తనపై ఎందుకు చర్యలు తీసుకున్నారో తెలియడం లేదని వసంత్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్ కోరారు.



మంత్రి దామోదర రాజనర్సింహతో వైద్యులు

వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో చర్చలు

ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం హైదరాబాద్‌లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిశారు. వైద్యుల సస్పెన్షన్ ఘటనపై ఆయనతో చర్చించారు. ఎలుకలకు, వైద్యుల సేవలకు సంబంధం లేదన్నారు. వైద్యులపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరారు. దోమకొండ ఆస్పత్రిని 100 పడకలుగా అప్‌గ్రేడ్ చేసే ప్రక్రియ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సానిటేషన్ కాంట్రాక్టర్‌కు షోకాజ్ నోటీస్



విచారణ జరుపుతున్న డీఎంఈ బృందం

ఇద్దరు వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసిన ఘటనపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ బృందం సోమవారం విచారణ చేపట్టింది. బృంద సభ్యులైన సంగారెడ్డి, సిద్దిపేట వైద్య కళాశాలల వైద్యులు కిషోర్, అనిల్‌కుమార్ ఆస్పత్రిలోని ఐసీయూ, డయాలసిస్ విభాగాలను సందర్శించారు. సస్పెన్షన్‌కు గురైన వైద్యులు వసంత్‌కుమార్, కావ్య, నర్సింగ్ ఆఫీసర్ మంజుల స్టేట్‌మెంట్‌లను రికార్డు చేశారు. బృంద సభ్యులు సానిటేషన్ కార్మికులతో మాట్లాడారు. సానిటేషన్ కాంట్రాక్ట్ సంస్థతో పాటు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే ఎలుకలు సంచరిస్తున్నాయని, ఎలుకల నివారణకు కేవలం గమ్ ప్యాడ్‌లు పెట్టి చేతులు దులుపుకుంటున్నారని విచారణలో తేలింది. దీంతో కాంట్రాక్ట్ సంస్థకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. డీఎంఈకి విచారణ నివేదికను అందిస్తామని బృంద సభ్యులు తెలిపారు.

వైద్యం చేయాలా.. ఎలుకలు పట్టాలా?



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వైద్యులు

తాము ఎలుకలు పట్టాలా? లేక రోగులకు వైద్య సేవలు అందించాలా? అని తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రోగిని ఎలుకలు కరిచిన ఘటనలో వైద్యులపై చర్యలు తీసుకోవడాన్ని నిరసిస్తూ సోమవారం జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద వైద్యులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యులు వైద్య సేవలు అందిస్తారని, ఆస్పత్రిలో సానిటేషన్ విభాగాన్ని చూడరని పేర్కొన్నారు. వైద్యులపై తక్షణమే సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే డీఎంఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

మారణాయుధాలు స్వాధీనం

- రెండు నాటు తుపాకులతోపాటు నాటుబాంబుల పట్టివేత
- నిందితుడి అరెస్ట్, రిమాండ్



నాటుతుపాకులు



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

గాంధారి(ఎల్లారెడ్డి) : అటవీ జంతువులను వేటాడుతున్న వ్యక్తి ఇంటిపై పోలీసులు దాడి చేసి రెండు నాటు తుపాకులు, నాటుబాంబులు ఇతర మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. రాంపూర్‌గడ్డ తండాకు చెందిన వల్లపు హన్మంతు అలియాస్ ఒడ్డె హన్మంతు కొంతకాలంగా అటవీజంతువులను వేటాడుతున్నాడని అటవీశాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సోమవారం హన్మంతు ఇంట్లో తనిఖీలు చేయగా, నాటుతుపాకులు, బాంబులతోపాటు ఇతర మారణాయుధాలు లభించాయి. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

ఎక్సైజ్ శాఖలో ఎస్సైల బదిలీ

కామారెడ్డి క్రైం: ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. జిల్లాలో పని చేస్తున్న పలువురు ఎస్సైలకూ స్థాన చలనం కలిగింది. ఇతర జిల్లాలనుంచి పలువురు జిల్లాకు వచ్చారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు సోమవారం సాయంత్రం జారీ చేశారు.

బదిలీల వివరాలు..

ఎస్సై పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జనార్దన్‌రెడ్డి	బిచ్కుంద	మధిర
జలీలుద్దీన్	ఎల్లారెడ్డి	బోధన్
బి.మమత	కామారెడ్డి టాస్క్‌ఫోర్స్	నిజామాబాద్
గంగాధర్	నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్	బాన్సువాడ
ఎంజీ.అశ్విని	బాలానగర్	దోమకొండ
బి.స్వర్ణలత	రంగారెడ్డి	ఎల్లారెడ్డి
పి.నగేష్	మెదక్	బిచ్కుంద
ఎస్.సుదర్శన్	నిజామాబాద్	కామారెడ్డి టాస్క్‌ఫోర్స్

మాకేదీ గుర్తింపు?



- పదేళ్ల పాటు పార్టీ కోసం కష్టపడ్డాం
- ఇతర పార్టీల వారిని చేర్చుకొని అన్యాయం చేయొద్దు
- కిందిస్థాయి నాయకత్వాన్ని ప్రోత్సహించాలంటున్న కాంగ్రెస్ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పదేళ్ల పాటు కేసులకు భయపడకుండా పార్టీని కాపాడుకున్న తమకు గుర్తింపు దక్కడం లేదని కిందిస్థాయి కాంగ్రెస్ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కోసం పనిచేసిన తమను కాదని.. అధికారంలోకి రాగానే కండువా కప్పుకున్న వారిని అందలమెక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఏమాత్రం గుర్తింపు దక్కకుండా కొందరు నాయకులు అడ్డుపడుతున్నారని కాంగ్రెస్ గ్రామ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు. కొందరు నాయకులు ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకత్వాన్ని ఏమాత్రం ప్రోత్సహించకుండా అంతా తామే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరుసగా పదేళ్ల పాటు అధికారం లేకున్నా.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంత అణగదొక్కినా.. కేసులు పెట్టి వేధింపులకు గురిచేసినా.. ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ పార్టీని అధికారంలోకి తేవాలనే లక్ష్యంతో ముందుకు సాగామని కార్యకర్తలు చెబుతున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌ను నామరూపాల్లేకుండా చేసేందుకు ప్రయత్నించినప్పటికీ అహర్నిషలు కష్టపడ్డామని సదరు కార్యకర్తలు అంటున్నారు. తాము పార్టీ కోసం ఇంత కష్టపడితే అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్‌ఎస్ నుంచి పలువురు కార్యకర్తలను, నాయకులను చేర్చుకునేందుకు కొందరు నాయకులు ఉత్సాహం చూపుతున్నారని సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు గుర్తింపు ఇవ్వకపోగా ఇలా ఇష్టం వచ్చినట్లు చేరికలను ప్రోత్సహించేందుకు ప్రయత్నించడం మానుకోవాలని కోరుతున్నారు. అధికారం ఉన్న సమయంలో బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టారని.. ఇప్పుడు వారే కాంగ్రెస్‌లో చేరేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొంటున్నారు. అలాంటి వారి విషయంలో గ్రామ, మండల స్థాయి నాయకులను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. ఏకపక్షంగా చేరికలను ప్రోత్సహిస్తే గ్రూపులు పెరిగి పార్టీ దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని చెబుతున్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో నష్టం జరిగే అవకాశం!

బీఆర్‌ఎస్ నుంచి చేరికలను ప్రోత్సహిస్తే కాంగ్రెస్‌కు లాభం జరగకపోగా నష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పార్టీ శ్రేణులు అంటున్నాయి. గ్రూపులు పెరిగి నిబద్ధత కలిగిన కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని, దీంతో చివరకు పార్టీ సైతం అభాసుపాలవుతుందని చెబుతున్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో సైతం పార్టీలో కోవర్టుల కారణంగా అనేక ఇబ్బందులు పడ్డామని వాపోతున్నారు. కోవర్టులకు చెక్ పెట్టడంతో పాటు, బయట పార్టీల నుంచి వచ్చే నాయకులను, కార్యకర్తలను చేర్చుకోకుండా ఉంటేనే ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేసే అవకాశముంటుందని అంటున్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలి

ఏళ్ల తరబడి పార్టీ కోసం పాటుపడిన తమకు స్థానిక సంస్థల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరుతున్నారు. పార్టీ భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకత్వాన్ని ప్రోత్సహించాలని డిమాండ్ చేస్తున్నారు. పార్టీ కోసం పాటుపడిన శ్రేణులకు ఈ మేరకు భరోసా కల్పిస్తేనే మంచి ఫలితాలుంటాయని, లోక్‌సభ ఎన్నికల్లో సైతం మంచి ఫలితాలుంటాయని అంటున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో సైతం యువ అభ్యర్థికి అవకాశం కల్పిస్తేనే మేలు కలుగుతుందని చెబుతున్నారు. బీజేపీ ప్రాబల్యం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో యువ నాయకత్వాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించాలని కోరుతున్నారు.

విద్యాశాఖ వింత పోకడ!

జిల్లా విద్యాశాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సర్కారు ఆదేశాలనూ పట్టించుకోకుండా పని సర్దుబాటు పేరిట అక్రమ డిప్యుటేషన్లు వేస్తున్నారు. ఈ అక్రమ డిప్యుటేషన్ల దందాపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- సర్కారు ఆదేశాలను పట్టించుకోని జిల్లా విద్యాశాఖ
- పని సర్దుబాటు పేరిట యథేచ్ఛగా అక్రమ డిప్యుటేషన్ల దందా



సాక్షి, కామారెడ్డి : పాఠశాల విద్యను బలోపేతం చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి ఆవాస ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా పాఠశాలలు ఏర్పాటు చేయడం, కావలసిన ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇదే సమయంలో ప్రభుత్వం ఉపాధ్యాయుల డిప్యుటేషన్లను కూడా రద్దు చేసింది. అయితే జిల్లా విద్యాశాఖ అధికారి మాత్రం ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా పనిచేస్తున్నారు.

అక్రమ డిప్యుటేషన్లు షరామామూలే..

కామారెడ్డి జిల్లాలో అక్రమ డిప్యుటేషన్లు షరామామూలయ్యాయి. ఉపాధ్యాయులు ఎవరైనా తీవ్రమైన అనారోగ్య సమస్యతో ఇబ్బంది పడుతుంటే వారికి అనుకూల పాఠశాలకు సర్దుబాటు చేయొచ్చు. కానీ జిల్లాలో ఇష్టారాజ్యంగా డిప్యుటేషన్లు సాగుతున్నాయి. డబ్బులు ఇస్తే చాలు కోరుకున్న చోటుకు డిప్యుటేషన్ వేస్తున్నారన్న విమర్శలున్నాయి. కొందరు ఉపాధ్యాయులు విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి డిప్యుటేషన్ ఆర్డర్లు తెచ్చుకుని ఇతర ప్రాంతాలకు వెళ్తుండగా.. ఇంకొందరు జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా జిల్లాలోని ఇతర ప్రాంతాలకు వెళ్లడం పరిపాటిగా మారింది. ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి అంటూ ఇంతకాలం సర్దుబాట్లు చేసిన డీఈవో ఇప్పుడు అధికారుల పేర్లను వాడుకుంటున్నారని పలువురు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో జరుగుతున్న అక్రమ డిప్యుటేషన్ల వ్యవహారంపై కలెక్టర్ దృష్టి సారించాలని కోరుతున్నారు.

విద్యార్థులున్నా..

ఎల్లారెడ్డి నియోజకవర్గం పరిధిలోని సదాశివనగర్ మండలం ఉత్తునూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసే ఓ ఉపాధ్యాయురాలిని ఇటీవల డిప్యుటేషన్‌పై పంపించారు. ఆమెను ‘వర్క్ అడ్జస్ట్‌మెంట్’ పేరుతో కామారెడ్డి నియోజకవర్గం పరిధిలోని భిక్కనూరు మండలం బస్వాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపిస్తూ ఈనెల 10న డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తునూరు ప్రాథమిక పాఠశాలలో 52 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా ఒకరిని డిప్యుటేషన్‌పై పంపడంతో ఒకే టీచర్ మిగిలారు.

ఉన్న టీచర్ సెలవు పెట్టినా, సమావేశాలకు వెళ్లినా ఆ పూట పాఠశాలకు సెలవే.. విద్యార్థులు ఉన్న స్కూల్‌నుంచి నుంచి టీచర్‌ను డిప్యుటేషన్‌పై పంపించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

యాభై కిలోమీటర్ల అవతలికి..

సదాశివనగర్ మండలం ఉత్తునూరు నుంచి భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామం 55 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఉత్తునూరు నిజామాబాద్ జిల్లా సరిహద్దుల్లో ఉంటే, బస్వాపూర్ మెదక్ జిల్లా సరిహద్దుల్లో ఉంటుంది. ఒకవేళ సర్దుబాటు చేయాల్సి వస్తే, స్థానికంగా అవసరం ఉన్న పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపించాలి. కానీ 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు పంపించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సదాశివనగర్ మండలంలో ఎన్నో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేనప్పటికీ, దూరాన ఉన్న ఇతర మండలాలకు డిప్యుటేషన్‌పై పంపించడం చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

బకాయి బిల్లులను చెల్లించాలని వినతి



నాగిరెడ్డిపేట: జీపీల ద్వారా తమకు రావాల్సిన బకాయి బిల్లులను వెంటనే ఇప్పించాలని కోరుతూ మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచులు కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌కు వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు జీపీల ద్వారా బిల్లులు రావాల్సి ఉందన్నారు. వాటిని సకాలంలో ఇప్పించాలన్నారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

మాదకద్రవ్యాలతో అప్రమత్తంగా ఉండాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : సామాజిక మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని పాటించాలని ఐఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ కో–ఆర్డినేటర్ రాజేందర్ రావు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ సంఘ మహిళలకు అవగాహన కల్పించారు. బాలికలకు సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ సైబర్ క్రైం 1930, చైల్డ్‌లైన్ నంబర్ 1098 మహిళ హెల్ప్‌లైన్ 181 సమస్యల్లో ఉన్నప్పుడు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రవళి, విఠల్‌రావు, సీసీలు నరేందర్ రెడ్డి, గ్రామ సంఘాల అధ్యక్షులు ఇంద్ర, సాయవ్వ, లత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్ల అందజేత

బాన్సువాడ : పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని బీర్కూర్ మండలం చించోలి ప్రాథమిక పాఠశాలకు ఫ్యాన్లను అందజేశారు. పీఆర్‌టీయూ మండల మహిళ కార్యదర్శి నాగమణి మాట్లాడుతూ పీఆర్‌టీయూ యూనియన్ ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాటం చేయడమే కాకుండా సేవా కార్యక్రమాలు చేయడంలో ముందుంటుందన్నారు. అన్నారం పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు.పీఆర్‌టీయు ఉపాధ్యాయులు సంతోష్‌జెట్టి, విఠల్‌యాదవ్, నాగరాజు, రామకృష్ణ, దుర్గప్రసాద్ ఉన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- డీఆర్‌డీవో సాయన్న
- ప్రజావాణికి 72 వినతులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్‌డీవో సాయన్న

కామారెడ్డి క్రైం : ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 72 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 27 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు చెందిన భూ సమస్యలవే కావడం గమనార్హం. 15 డబుల్ బెడ్‌రూం, 10 ఉపాధి కల్పన, 5 జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి సంబంధించినవి కాగా మిగితావి ఆయా శాఖలకు చెందిన దరఖాస్తులు సమోదయ్యాయి. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, ఆయా శాఖల జిలా అధికారులు పాల్గొన్నారు.

కస్తూర్బా ప్రత్యేకాధికారిపై చర్యలు తీసుకోవాలి

తమను ఇబ్బందులకు గురి చేస్తున్న పాఠశాల ప్రత్యేకాధికారి (ఎస్‌వో) మమతపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దోమకొండ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఉద్యోగులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. వారు మాట్లాడుతూ రెండేళ్లుగా పాఠశాల ఎస్‌వో తీరుతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఇటీవలే పిల్లలకు భోజనం సరిగ్గా పెట్టడం లేదని ప్రశ్నించినందుకు పీఈటీ వీణను మానసికంగా ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ఆమెతో మాట్లాడితే మా అందరిని కూడా టార్గెట్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఎస్‌వో ప్రవర్తనా తీరు కారణంగా విద్యార్థుల చదువులపై ప్రభావం పడుతుందన్నారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

యోగాతో వ్యాధులు దూరం



కామారెడ్డి పట్టణంలో స్వామి యజ్ఞదేవ్‌తో యోగా, స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు



బిచ్కుందలో మాట్లాడుతున్న యజ్ఞదేవ్ స్వామి

కామారెడ్డి అర్బన్: ఔషధీయ యజ్ఞసహిత యోగా కార్యక్రమంతో క్యాన్సర్, బ్రెయిన్ ట్యూమర్‌లాంటి తీవ్రవ్యాధులు దరిచేరవని స్వామి రాందేవ్ బాబా శిష్యుడు, రాష్ట్ర ఇన్‌చార్జి స్వామి యజ్ఞదేవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ భవన్‌ను ఆయన సోమవారం సందర్శించి ప్రతినిధులతో మాట్లాడారు. 916 రోజులుగా కామారెడ్డిలో ప్రతిరోజూ ఔషధీయ యజ్ఞసహిత యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు జిల్లా ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి, యోగాచార్యులు జి అంజయ్యగుప్తా, ప్రతినిధులు బి రఘుకుమార్, కె సిద్ధాగౌడ్, యెల్లంకి సుదర్శన్, సురేశ్, ఎల్లయ్య, వెంకటేశం, కాసర్ల రామచంద్రం తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్, సిద్దిపేట వ్యాసమహర్షి యోగా సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో కామారెడ్డి ప్రతినిధులు పాల్గొని సూర్యనమస్కారాల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణ పతకాలు సాధించారు. అజయ్, బద్దం అనిల్‌రెడ్డి స్వర్ణపతకాలు సాధించారు. వీరిని స్వామి యజ్ఞదేవ్ అభినందించారు.

దైవభక్తిని పెంచుకోవాలి

బిచ్కుంద(జుక్కల్) : ప్రతిరోజు యోగా చేస్తే ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా ఉంటామని, చెడు వ్యాసనాలకు దూరంగా ఉండి యోగాతో పాటు దైవభక్తి పెంపొందించుకొని మంచి పేరుప్రతిష్టలు పొందాలని కోరారు.రాందేవ్ బాబా శిష్యుడు హరిద్వార్ యజ్ఞదేవ్ స్వామి అన్నారు. బిచ్కుందలో స్కాలర్‌షిప్ పాఠశాలలో సోమవారం స్వామి దయానంద్ సరస్వతి 200 జయంతిని ఘనంగా నిర్వహించారు. హరిద్వార్‌కు చెందిన యజ్ఞదేవ్ స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాందేవ్ బాబా యోగాతో ఎన్నో దీర్ఘకాలిక ఇతర వ్యాధులు తగ్గించారు మీరు ప్రతిరోజు సూర్యోదయం కన్న ముందు యోగా చేసే అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం యజ్ఞం, పూజా కార్యక్రమంలో నిర్వహించారు. స్వామి దయానంద్ సరస్వతి జీవిత చరిత్ర గురించి వివరించారు. ఈకార్యక్రమంలో రఘుకుమార్, కిషోర్, ప్రిన్సిపాల్ సత్యవీర్, యోగా, పతాంజలి సభ్యులు పాల్గొన్నారు.

బిగ్ హెల్ప్ కళావేదిక ప్రారంభం



కళావేదికను ప్రారంభించిన డీఈవో రాజు

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని పోతాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బిగ్ హెల్ప్ కళావేదికను డీఈవో రాజు, బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ సరోజిని సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మనిషి జీవితాన్ని మార్చేది కేవలం విద్య మాత్రమే అన్నారు. సమాజంలో విద్య ప్రతీ ఒక్కరికి అందాలనే ఉద్దేశంతో విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి సహాయ సహకారాలు అందిస్తూ ఎంతో మందికి ఉన్నత శిఖరాలకు చేర్చుతున్న బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ వ్యవస్థాపకులు చాంద్‌పాష, సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సహాయ సహకారాలు అందిస్తున్న ఎన్ఆర్ఐలను అభినందించారు. సుమారు రూ. 5 లక్షల వ్యయంతో కళావేదికను నిర్మించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో రామస్వామి, తెలంగాణ జోన్ డైరెక్టర్ మల్లేశం, ప్రాజెక్టు డైరెక్టర్ అజ్మత్, హెచ్‌ఎం అంజల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కామారెడ్డి అర్బన్ : దళిత మహిళను అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మద్దెల బాగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ సింధు శర్మకు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే 9మంది అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు ఎస్పీ వివరించారు. ఎస్పీని కలిసిన వారిలో కాంగ్రెస్‌పార్టీ ఎస్సీసెల్ నాయకులు జి చిన్నరాజు, మన్నె నరేష్ తదితరులున్నారు.

నయీంకు సన్మానం



భిక్కనూరు : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నయీం జన్మదినం సందర్భంగా ఆయనను భిక్కనూరు మండల కాంగ్రెస్ నేతలు సోమవారం సన్మానించారు. కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్ పూలమాలలతో శాలువతో నయీంను సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం



భిక్కనూరు : మండలంలోని జంగంపల్లిలో ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు సోమవారం అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీటీసీ మాజీ సభ్యురాలు పుల్లూరి బాల్‌నర్సవ్వ రామస్వామి ప్రారంభించారు. స్కూల్‌లో 45 మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారని వీరికి అల్పాహారం ఇచ్చేందుకు మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బాల్‌నర్సవ్వ రామస్వామి ముందుకు రావడం అభినందనీయమని హెచ్‌ఎంరాజేంద్రప్రసాద్ అన్నారు.

కేంద్ర పథకాలపై మహిళలకు అవగాహన



భిక్కనూరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గురించి భిక్కనూరు మండల కేంద్రంలో మహిళలకు బీజేపీ నేతలు సోమవారం అవగాహన కల్పించారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పొందిన లబ్ధిదారులకు కేంద్రపథకాలపై అవగాహన కల్పించారు. బీజేపీ మండల ఉపాధ్యాక్షుడు అరిగే నర్సింలు,ఓబీసీ మండలాధ్యక్షుడు ఉప్పరి రమేష్, కిరణ్ తదితరులున్నారు.

సృజనాత్మకత పోటీల్లో విద్యార్థుల ఎంపిక



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

కామారెడ్డి అర్బన్ : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక హౌసింగ్‌బోర్డులోని భవిత హైస్కూల్‌లో విద్యార్థులకు పోటీలు నిర్వహించగా 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఒక్కో విభాగంలో జిల్లాస్థాయిలో ముగ్గురిని ఎంపిక చేసి 18 మందిని రాష్ట్రస్థాయికి ఎంపికచేశారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో ఎస్ రాజు మాట్లాడుతు..జిల్లాలో ప్రతిభ చూపిన విద్యార్థులు ఈనెల 28న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం బహుమతులు అందజేశారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు వీరే..

పెయింటింగ్‌లో యు లక్ష్మిపతి, జే లక్ష్మిప్రసన్న, ఎస్ నవకాంత్, కవిత్వంలో కే గంగోత్రి, ఇర్ఫాన్ ఫాతిమా, జి అమూల్య, పాటల పోటీలో ఆర్ శారదా, డి మేఘన, కే మధులత, ఉపన్యాస పోటీలో పి అక్షర, కే సాత్విక్, ఎస్ ప్రతీక్‌గౌడ్, ఏకపాత్రాభినయంలో నిశిత, అర్విండ్, లక్షిత్, నాటకంలో ఎ సంజన బృందం(గాంధారి), ఎం.రుచిత బృందం(నిజాంసాగర్), ఎం.శ్రావణి బృందం (కామారెడ్డి)లు ఎంపికయ్యారు.

సెల్‌ఫోన్ల రికవరీ



ఎల్లారెడ్డి: స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో 13 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు సీఐ రవీందర్‌నాయక్ తెలిపారు. ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ప్రత్యేక కార్యక్రమంలో ఏర్పాటు చేసిన బాధితులకు సెల్‌ఫోన్లను అప్పగించారు. ఎల్లారెడ్డి పీఎస్ పరిధిలో 5, లింగంపేట పీఎస్ పరిధిలో ఒకటి, నాగిరెడ్డిపేట పీఎస్ పరిధిలో 7 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా సీఈఐఆర్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయలేనిపక్షంలో బాధితులు తమ ఆధార్‌కార్డు వెంట తీసుకువచ్చి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు బొజ్జ మహేశ్, చైతన్యకుమార్‌రెడ్డి, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం అందజేత



దోమకొండ : మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయ రాజగోపుర నిర్మాణానికి సోమవారం గ్రామానికి చెందిన అల్లె రవి దంపతులు రూ.23,011 విరాళంగా అందజేసినట్లు ఆలయకమిటీ అధ్యక్షుడు పాలకుర్తి శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా రవి దంపతులను సన్మానించారు. ఆలయ కమిటీ ప్రతినిధులతో పాటు డాక్టర్ సాయబుగారి రాజు, చాకలి నర్సింలు, అర్చకులు భావి శరత్‌చంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బాన్సువాడలో బైక్ చోరీ

బాన్సువాడ: పట్టణంలోని బండగల్లీలో ఆదివారం రాత్రి బైక్ చోరీకి గురైంది. కాలనీకి చెందిన పింకిరాజు తన బైక్‌ను రాత్రి ఇంటికి ఎదుట నిలిపి నిద్రించాడు. ఉదయం బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రాజు తెలిపాడు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఇందల్వాయి: మండలంలోని అన్సాన్‌పల్లి వద్ద ఆదివారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో గాయపడ్డ నందిపేట్ మండలం తల్వేదకు చెందిన ఎర్నాల లక్ష్మణ్(26) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మనోజ్ సోమవారం తెలిపారు. ఇటీవల గల్ఫ్ నుంచి వచ్చిన లక్ష్మణ్ ధర్పల్లిలోని తన స్నేహితుడిని కలిసేందుకు ఆర్మూర్‌కి చెందిన మరో స్నేహితుడితో కలిసి ధర్పల్లికి వచ్చి తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


రెంజల్: మండలంలోని నీలా గ్రామం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ సోమవారం తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మోపాల్‌లో డ్రంకన్‌డ్రైవ్ కేసులు

మోపాల్: మోపాల్ పీఎస్ పరిధిలో సోమవారం రెండు డ్రంకన్ డ్రైవ్, మూడు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న కేసులు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. వారి వాహనాలు స్వాధీనం చేసుకుని, వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపినా.. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

చెట్టును ఢీకొన్న బైక్

- ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు



భీమ్‌గల్: ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని మెండోరా గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై హరిబాబు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇట్టంపేట రాజన్న(49), తెలిసిన వ్యక్తి సాజిద్‌బేగ్ రాజన్న పొలానికి బైక్‌పై వెళ్తుండగా మెండోరా శివారులోని మల్లన్న గుడి ప్రాంతంలో ఉన్న చెట్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో సాజిద్, రాజన్నకు తీవ్ర గాయాలు కాగా రాజన్న అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సాజిద్‌ను జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు వినీత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో ఇందల్వాయి మండలంలోని వెంగళపాడ్ గ్రామానికి చెందిన బానోతు రవికి నాలుగు రోజుల జైలు శిక్షను సెకండ్ క్లాస్ జడ్జి మహమ్మద్ ఖదీర్ విధించినట్లు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ సోమవారం తెలిపారు. జిల్లాలో 26 మందిని కోర్టులో హాజరుపర్చగా రూ. 29,100 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

పాఠశాల కరస్పాండెంట్ అదృశ్యం

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ ఒకరు అదృశ్యమైనట్లు ఎస్సై సాయికుమార్ సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డితో పాఠశాల భాగస్వాములు డబ్బుల విషయంలో ఆదివారం రాత్రి గొడవపడ్డారు. దీంతో భాస్కర్‌రెడ్డి రాత్రి నుంచి ఇంటికి రాలేదని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

- కాళ్లు, చేతులు కట్టేసి చెరువులో పడేసినట్లు అనుమానం
- విచారణ చేపట్టిన ఏసీపీ



నరేశ్ (ఫైల్)

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లికి చెందిన రొడ్డ నరేశ్(30) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు.. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నరేశ్ అదే గ్రామానికి చెందిన దివ్యను ఎనిమిదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి విఘ్నేష్, రుత్విక్ ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 10న రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ భార్య దివ్యను నరేశ్ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకొచ్చాడు. అదే రోజు రాత్రి ఇంటి నుంచి వెళ్లిన నరేశ్ తిరిగి రాలేదు. ఈ నెల 11న కుటుంబీకులు పోలీసులకు ఫిర్యా దు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఇది లా ఉండగా సోమవారం ఉదయం నరేశ్ గ్రామ శివారులోని చెరువులో శవమై కనిపించాడు. మృతుడి కాళ్లు, చేతులను తాళ్లతో కట్టేసి ఉండడంతో అనుమానాస్పద కేసుగా దర్యాప్తు చేపట్టారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ

మోకన్‌పల్లి చెరువులో అనుమానాస్పదంగా మృతి చెందిన నరేశ్ మృతదేహాన్ని నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్, నార్త్ రూరల్ ఇన్‌చార్జి సీఐ నరేశ్ కుమార్, ఎస్సై యాదగిరిగౌడ్ పరిశీలించారు. కాళ్లు చేతులు తాళ్లతో కట్టేసి ఉండడంతో పలువురిని విచారించారు. తల్లి అబ్బవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు..

సదాశివనగర్: అడ్లూర్‌ఎల్లారెడ్డి శివారులోని సర్వీస్ రోడ్డుపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై రాజు సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్‌కు చెందిన బాబు(38) మూడు నెలల క్రితం గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో పనిచేసేందుకు భార్యతో వచ్చి మర్కల్ శివారులోని గుడిసెలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా అడ్లూర్ ఎల్లారెడ్డి శివారులోని సర్వీస్ రోడ్డు ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి భార్య బూలిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో కిందపడి ఒకరు..

బోధన్‌రూరల్: మండలంలోని సిద్ధాపూర్‌లో నీలకంఠ (45) అనే వ్యక్తి తన ఇంటి సమీపంలో మద్యం మత్తులో కిందపడి మృతిచెందినట్లు బోధన్ రూరల్ పోలీసులు సోమవారం తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఆలూర్‌లో అనుమానితుల అరెస్ట్

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండల కేంద్రంలో సోమవారం అనుమానంగా తిరుగుతున్న నలుగురు మహిళలు, ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకున్నారు. పిల్లలను కిడ్నాప్ చేసే ముఠాగా భావించి వారిని పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వారిని పీఎస్‌కు తరలించి విచారణ చేపట్టారు. విచారణలో ప్రస్తుతం వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కృష్ణ జిల్లా చెందిన వారని తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

నస్రుల్లాబాద్: మండలంలోని బొప్పాస్‌పల్లి పరిధిలో పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. దాడిలో 13 మందిని అరెస్టు చేసి వారి నుంచి 14 ఫోన్‌లు, 9బైక్‌లు, రూ.38,240 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు. పక్కా సమాచారం మేరకు ప్రత్యేక బృందంతో కలిసి దాడిచేసినట్లు తెలిపారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

రెంజల్(బోధన్): అప్పుల బాధ తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది ఒకరు కందకుర్తిలోని గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ పట్టణం రాకాసిపేటకు చెందిన సయ్యద్ కరీముల్లా (33) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. వ్యాపారంలో అప్పులు కావడంతో కొంత కాలంగా మనోవేదనకు గురయ్యేవాడని కుటుంబీకులు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు.

కందకుర్తిలోని గోదావరి నదిలో ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందడంతో ఘటన స్థలానికి వెళ్లగా బైక్, చెప్పులు లభించాయన్నారు. మృతదేహం కోసం గాలించగా ఆదివారం ఉదయం లభ్యమైందన్నారు. మృతుడి భార్య సమ్రీన్ సుల్తానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



భిక్కనూరు: మండల కేంద్రంలోని చర్చి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. దోమకొండ మండలంలోని అంచనూరుకు చెందిన సిద్ధరాములు–తిరుమలమ్మలు వ్యక్తిగత పనినిమిత్తం మెదక్ జిల్లా రామాయంపేటకు వెళ్లి వస్తుండగా మండల సమీపంలో హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న టాటా ఏసీ వాహనం వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో దంపతులకు తీవ్రగాయాలయాలు కాగా స్థానికులు అంబులెన్స్‌లో కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజశేఖర్‌రాజు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్‌రాజు తెలిపారు. నగరంలోని ఐదో టౌన్ పీఎస్ పరిధిలోని భారతిరాణి కాలనీలో ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తేలడంతో కాలనీకి చెందిన షేక్ ముజీబ్ అహ్మద్, షేక్ నజీబ్ అహ్మద్‌లను అదుపులోకి తీసుకోగా వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ. 46,700 నగదును స్వాధీనం చేసు కున్నట్లు తెలిపారు. ఈ బెట్టింగ్ సభ్యులైన మరో ముగ్గురు రాజస్తాన్‌కు చెందిన యాంచ్, నగరంలోని ఆటోనగర్‌కు చెందిన షేక్ శైబజ్, బాబన్‌సహాబ్‌పహాడ్‌కు చెందిన అఫ్జల్, సారంగపూర్‌కు చెందిన రాహుల్, ఆహ్మదీ మార్కెట్‌కు చెందిన ముస్తాఫ్ అహ్మద్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. నిందితులు తెలంగాణ, మహారాష్ట్రలో భారీ ఎత్తున అమాయక ప్రజలను మోసగించి, వారిని ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడేలా చేసి, వారి నుంచి డబ్బులను దోచుకుంటున్నట్లు తెలిపారు. నగరంలో సుమారు 200 మంది వీరి చేతిలో మోసపోయినట్లు గుర్తించినట్లు చెప్పారు. వీరు మహారాష్ట్ర, రాజస్థాన్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకుల ద్వారా ఐడీలు ఇప్పించి తద్వారా బెట్టింగ్ చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. విచారణలో ఇంకా పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐలు అంజయ్య, అజయ్‌బాబు, ఎస్సై అప్పారావు, సిబ్బంది ఉన్నారు.